సాక్షి
మెదక్
ఆదివారం । 11 । మే । 2025

బిడ్డ కోసం బతుకుపోరాటం


కూతురు సాత్వికతో తల్లి విజయ

సిద్దిపేటజోన్: విధి వక్రించి ఇంటి పెద్ద దూరం అయ్యాడు. దిక్కుతోచని స్థితిలో ఇంటి బాధ్యతలు భరిస్తూనే.. కన్న కూతురుకు తండ్రి లేడనే కొరత లేకుండా అన్నీ తానై అమ్మకు ప్రతీకగా నిలిచింది విజయ. సిద్దిపేటకు చెందిన విజయ వివాహం జరిగిన పదేళ్లకే భర్తను కోల్పోయింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా కూతురు సాత్విక.. ఆలనా పాలన విషయంలో ఏ మాత్రం తేడా లేకుండా కష్టపడి పోషిస్తోంది. రెక్కల కష్టంపై ఆధారపడి ఇంటిని ముందుకు నడిపిస్తోంది. ఒక్కగానొక్క కూతుర్ని బాగా చదివించి ప్రయోజకురాలిని చేయాలనే ఏకైక లక్ష్యంగా విజయ జీవితంతో పోరాటం చేస్తోంది. చిన్న చిన్న పనులు చేస్తూ వచ్చిన కొద్దిపాటి డబ్బులతో కూతురును పోషిస్తూ ఉన్నత ప్రయోజకురాలిగా తీర్చిదిద్దుతోంది.

కనిపించే దైవం.. అమ్మ



అమ్మ.. కనిపించే దైవం. ప్రేమ, త్యాగం, భరోసా, ఓర్పు, సహనం, ధైర్యం.. వీటిన్నింటికీ మారుపేరు అమ్మే. ప్రపంచంలో వెలకట్టలేనిది తల్లి ప్రేమే. పొత్తిళ్లలో బిడ్డను చూడగానే ప్రసవ వేదనను మర్చిపోతుంది. నవమాసాలు మోసి, కన్న బిడ్డల్ని కంటికి రెప్పలా చూసుకుంటుంది. బిడ్డల ఎదుగుదలనే తన ఎదుగుదల అనుకుంటుంది. పిల్లల మనసును అర్థం చేసుకుని అడగకుండానే అన్నీ ఇస్తుంది. ఎంత కష్టమొచ్చినా భూదేవిలా తనలో దాచుకుంటుందే తప్ప, ఎవరినీ నిందించదు. ఎప్పుడూ మంచే జరగాలని కోరుకునే అమ్మ మనసు అమృతం కన్నా గొప్పది.

ఇంతటి ఔన్నత్యాన్ని చాటుతున్న అమ్మలపై నేడు మదర్స్ డే సందర్భంగా కొన్ని ప్రత్యేక కథనాలు..

కంటికి రెప్పలా కాపాడుతూ..


పరశురాములుకు అన్నం తినిపిస్తున్న తల్లి బుచ్చవ్వ

నంగునూరు(సిద్దిపేట): 'తొలిసూరు కొడుకు పుట్టాడని సంతోషపడ్డా.. కాని మాటలు రాకపాయే.. కాళ్లు, చేతులు పని చేయక 30 ఏళ్ల నుంచి గోస పడుతుండు బిడ్డ..' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది నంగునూరుకు చెందిన కాసర్ల బుచ్చవ్వ. పండుగలు, పబ్బాలను పక్కన పెట్టి ఇంటి పట్టునే ఉంటూ కొడుకుకు సపర్యలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుతోంది మాతృమూర్తి. సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన కాసర్ల మల్లయ్య, బుచ్చవ్వ దంపతులకు కుమారుడు పర్శరాములు (31), ఇద్దరు కూతుళ్లు. నిరుపేదలైన వీరు కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డల పెళ్లి చేశారు. పుట్టుకతో మూగ, చెవిటి వాడైన పరశురాములు కాళ్లు, చేతులు చచ్చుబడి ఎటూ కదలలేని స్థితిలో బతుకీడుస్తున్నాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. కొడుకు దీనావస్థను చూసి కుంగిపోని తల్లి బుచ్చవ్వ పరశురాములు రోజు సపర్యలు చేస్తూ, పళ్లు తోమడం, అన్నం తినిపించి, స్నానం చేయిస్తూ చిన్న పిల్లాడిలా సాకుతోంది. రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో కుటుంబ పరిస్థితులు ఉన్నా బిడ్డ కోసం అన్ని వదులుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తోంది మాతృమూర్తి.

40 ఏళ్లుగా అన్నీ తానై..

దివ్యాంగులైన కుమారులకు మాతృమూర్తి సేవలు


కుమారుడికి స్నానం చేయిస్తున్న తల్లి

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగులైన ఇద్దరు కుమారులను 40 ఏళ్లుగా కంటికి రెప్పలా చూసుకుంటోంది ఓ మాతృమూర్తి. లేచింది మొదలు వారి సేవలోనే జీవితం గడుపుతోంది. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం రోడ్డులో వృద్ధురాలైన చంద్రకళ నివిస్తోంది. భర్త మడపతి చంద్రయ్య 2009 లో మృతి చెందాడు. నలుగురు కుమారులు. ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఒక కొడుకు రాజశేఖర్, కూతురు భాగ్యలక్ష్మి బాగానే ఉన్నారు. మిగతా నలుగురిలో కూతురు ఉమరాణి పుట్టుకతోనే మూగ. మిగతా ముగ్గురు కుమారులు సిద్ధప్ప, మహేశ్వర్, రవికుమార్‌లకు చిన్నప్పుడే కాళ్లు, చేతులు పడిపోయాయి. మాటలు రాని ఉషారాణి సైతం ప్రస్తుతం తల్లి మీదే ఆధారపడింది. మూడేళ్ల క్రితం రెండో కుమారుడైన మహేశ్వర్ మృతి చెందాడు. ఉన్న ఇద్దరు కుమారులకు, కూతురుకు ఉదయం లేచిన మొదలు.. రాత్రి పడుకునే వరకు సేవలు చేస్తూ కాలం గడుపుతోంది వృద్ధురాలు.

పెన్షనే ఆధారం..

అయితే వీరి జీవనాధారం.. తల్లి తోపాటు ఇద్దరు కుమారులకు వచ్చే పెన్షన్ మొత్తం రూ.10 వేల తోనే నెల మొత్తం గడపాల్సి వస్తోంది. అప్పుడప్పుడు దాతలు వచ్చి నిత్యావసర సరుకులు ఇచ్చి వెళ్తారని ఆ తల్లి తెలిపారు. తమ తల్లి 40 ఏళ్లకు పైగా తమను చూసుకుంటుందని, చిన్నపిల్లలను చూసుకునే విధంగా రోజూ స్నానం చేయించి, భోజనం తినిపించి ప్రేమగా చూసుకునే తల్లి దొరకడం అదృష్టంగా భావిస్తున్నామని కుమారులు సిద్దప్ప, రవికుమారులు అంటున్నారు.


దివ్యాంగులైన కుమారులకు తినిపిస్తున్న తల్లి చంద్రకళ

పేదరికం నుంచి.. ఉన్నతస్థాయికి చేర్చి


అమ్మ లక్ష్మితో నవీన్ గౌడ్

దుబ్బాకటౌన్: ఓ తల్లి కృషి.. పేదరికం నుంచి మొదలైన అడుగు ఉన్నత స్థానాలను చేర్చింది. దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన యాడారం లక్ష్మి.. వివాహమైన కొన్నేళ్లకే అనారోగ్య కారణాలతో భర్తను కోల్పోయింది. తాను బీడీలు చుడుతూనే కొడుకు నవీన్ గౌడ్‌ను బాగా చదివించింది. అమ్మ కష్టాన్ని తెలుసుకున్న నవీన్ గౌడ్ సైతం కష్టపడి చదివాడు. 2009లో పదో తరగతి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. ఇంటర్ పూర్తయ్యాక.. బీటెక్ చేస్తున్న సమయంలోనే ప్రభుత్వ ఉద్యోగం కోసం పుస్తకాలతో కుస్తీ పట్టాడు. 2018లో పంచాయతీ కార్యదర్శిగా, గ్రూప్ -4 ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. 2020లో హాస్టల్ వార్డెన్‌గా ఎంపికై విధులు నిర్వహిస్తున్నాడు.

గ్రూప్– 2 లో స్టేట్ 166 ర్యాంక్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 2 ఫలితాల్లో నవీన్‌గౌడ్ స్టేట్ 166 ర్యాంక్ సాధించి ప్రతిభ కనబర్చారు. చిన్నప్పటి నుంచి కిరాయి ఇంట్లోనే ఉంటున్న నవీన్ గౌడ్ ఇటీవల తన సొంతింటి కళను సైతం నిజం చేసుకుని అమ్మ కోరికను తీర్చారు. కాగా గ్రూప్–2లో మంచి పోస్టింగ్ వస్తుందని నవీన్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కూలి పనులు చేస్తూ పిల్లల ఉన్నతికి శ్రమిస్తూ

చిన్నకోడూరు(సిద్దిపేట): పిల్లల బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తోంది ఆ తల్లి. తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ, మరోవైపు కూలీ పనులకు వెళ్తూ తన పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతోంది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన గోవిందారం రజితకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భర్త శ్రీహరి పిల్లలు చిన్న వయస్సులో ఉన్నప్పుడే మృతి చెందాడు. ఇంటి బాధ్యత అంతా తనపై వేసుకుని పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తోంది. పెద్ద కూతురు పూజిత(బీ ఫార్మసీ), రెండో కూతురు మోనిక (డిగ్రీ ద్వితీయ), మూడో కూతరు వైష్ణవి(ఇంటర్ మొదటి), కుమారుడు సాత్విక్(6వ తరగతి) చదువుతున్నారు. వారికి ఎలాంటి లోటురాకుండా నిరంతరం శ్రమిస్తూ వారిని ఉన్నత చదువులు చదివించాలని సంకల్పిస్తూ మందుకు సాగుతున్నారు.


ముగ్గురు కూతుళ్లు, కుమారునితో తల్లి రజిత

బీడీలు చుడుతూ.. కష్టాలకు ఎదురీదుతూ..



దుబ్బాక: అమ్మా అనే పదానికి నిలువెత్తు నిదర్శనం దుబ్బాక పట్టణానికి చెందిన లావణ్య.. ముక్కు పచ్చలారని వయస్సులోనే పెళ్లి.. ఆపై ఇద్దరు ఆడపిల్లలు.. పెళ్లయిన ఐదేళ్లకే చేనేత కార్మికుడైన భర్త అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త అంత్యక్రియలు సైతం స్థానికులు చందాలు వేసుకుని జరిపించారు. ఈ పరిస్థితుల్లో పిల్లలు, వృద్ధులైన అత్తామామలు భారంగా భావించకుండా రెక్కల కష్టంతో పోషిస్తోంది. ఓ చిన్న కిరాయి ఇంట్లో ఉంటున్న లావణ్య దీనస్థితిని చూసి ఏడాదిన్నర క్రితం డబుల్ బెడ్రూం ఇచ్చారు. 2011లో అంగన్ వాడి ఆయాగా నియమించారు. ఆయాగా పనిచేస్తూ బీడీలు చుడుతూ.. బట్టలు కుడుతూ నిరంతరం శ్రమిస్తోంది. 7వ తరగతి వరకే చదువుకున్న లావణ్య.. బిడ్డలను చదివించడమే కాకుండా తాను 10 వ తరగతి (ఓపెన్ టెన్త్) పాసయింది. ప్రస్తుతం పెద్దకుమార్తె ఆకాంక్ష బీఎస్సీ నర్సింగ్ చదువుతుండగా, చిన్నకుమార్తె కావ్య ఇప్పుడు ఇంటర్ పూర్తి అయి ఎంసెట్ రాశారు. కష్టాలకు ఎదురీదుతూ కూతుళ్లను మంచి చదువులు చదివిస్తున్న ఈ మాతృమూర్తి ఆదర్శంగా నిలుస్తున్నారు.

32 ఏళ్లుగా సేవలు..



ఝరాసంగం(జహీరాబాద్): ఓవైపు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం నిర్వహిస్తూ.. మరోవైపు కదలలేని స్థితిలో ఉన్న కుమారుడిని కంటికి రెప్పలా కాపాడుతోంది ఓ మాతృమూర్తి. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం కుప్పానగర్‌కు చెందిన ఈశ్వరమ్మ, రాములుకు 32 ఏళ్ల క్రితం మనోజ్ కుమార్ జన్మించాడు. పుట్టుకతోనే కదలలేని స్థితిలో ఉన్న కుమారుడికి బాగవుతుందని నమ్మకంతో పలు ఆస్పత్రులలో సంప్రదించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. పుట్టినప్పటి నుంచి నేటి వరకు కుమారుడికి అన్ని విధాలుగా సేవలు చేస్తూ కనుపాపలా చూసుకుంటోంది ఆ తల్లి. స్నానం చేయించడం, తినిపించడం, వంటి అన్నీ తానై సేవలు అందిస్తున్నారు. ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే కొడుకుకి ఏ లోటు లేకుండా చూసుకుంటున్నారు.

40 మంది చిన్నారులకు అమ్మలా..

బాలసదనంలోని అనాథల ఆలనాపాలన చూస్తున్న రమాదేవి

కొండపాక(గజ్వేల్): సిద్దిపేట జిల్లా కొండపాకలోని బాలసదనంలో 40 మంది అనాథ పిల్లలకు తల్లిలేని లోటును తీరుస్తున్నారు. అందరితో అమ్మగా పిలుపించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు బాలసదనం ఇన్‌చార్జి రమాదేవి. హైదరాబాద్ పట్టణానికి చెందిన రమాదేవి జవహర్ లాల్ బాలసదనంలో సూపరింటెండెంట్ ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. బాల సదనంలో పిల్లల పోషణ బాధ్యత విషయాల్లో ఎంతో నిక్కచ్చిగా వ్యవహరించారు. ఈక్రమంలోనే కొండపాకలోని ఆనంద నిలయం నిశాంత్ బాలసదనంలో ఏడేళ్లుగా 40 మంది అనాథ పిల్లలకు తల్లిలేని లోటును తీరుస్తూ వారిలో సంతోషాన్ని నింపుతున్నారు. సిద్దిపేట పట్టణానికి చెందిన రాజమౌళి మనవడు నిశాంత్ చిన్న తనంలో చనిపోవడంతో ఆయన జ్ఞాపకార్థం కొండపాకలో వారి కుటుంబసభ్యులు నిశాంత్ బాలసదనాన్ని నిర్మించారు. ఈ సదనంలో ఉన్న పిల్లలకు చదువు, ఆటలు, క్రమశిక్షణ, భగవద్గీత శ్లోకాలు, సమాజ సేవా దృక్పథాలు నేర్పిస్తూ ఆలనా పాలన చూస్తున్నారు. కుటుంబంతో హాయిగా గడుపాల్సిన రమాదేవి అన్నింటిని వదిలి అనాథ పిల్లలతోనే ఉంటూ సేవలు చేస్తున్నారు. పిల్లలందరూ అమ్మా.. అమ్మా.. అంటూ పిలుస్తుండటంతో ఆ పిలుపుల్లో ఉన్న మాధుర్యం, ఆనందాన్ని మాటల్లో చెప్పలేనంటూ రమాదేవి ఆనంద బాష్పాలు రాల్చారు. ప్రస్తుతం పిల్లలను వదిలి ఒక్క రోజు కూడా ఉండలేకపోతున్నానన్నారు.


బాలసదనంలో పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న రమాదేవి


అనాథ పిల్లలతో ఇన్‌చార్జి రమాదేవి

అమ్మా అనే పిలుపుతో..

పిల్లలందరూ అమ్మా.. అంటూ పిలుస్తుండటంతో ఆ మాధుర్యం, ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ప్రస్తుతం పిల్లలను వదిలి ఒక్క రోజు కూడా ఉండలేకపోతున్నా. నాకు ఏ చిన్న ఆరోగ్య సమస్య ఎదురైనా పిల్లలందరూ అమ్మా అంటూ చుట్టూ నిలువగా ఆ బాధనుంచి ఉపశమనం పొందుతున్నాను. అమ్మా అంటూ పిలుపించుకునే భాగ్యం దొరకడం అదృష్టం. ఈ అవకాశం దొరికేలా చేసిన అందరికీ రుణపడి ఉంటాను.

– రమాదేవి, బాలసదనం ఇన్‌చార్జి

మిషన్ కుట్టి.. బతుకుబండి చేపట్టి



చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన అవుసుల దుర్గమణి మిషన్ కుడుతూ తన పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భర్త నాగభూషణాచారి అనారోగ్యంతో మృతి చెందాడు. అ సమయంలో చిన్న కుమారుడు ఆరు నెలల పసికందు.. అయినప్పటికీ చెదిరిపోని ధైర్యంతో కుట్టుమిషన్ నడుపుతూ ముగ్గురు పిల్లలను పోషించింది. కుమార్తె వివాహం చేయగా, ఇద్దరు కుమారులు ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడ్డారు. చందంపేట జెడ్పీపాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చిన్న కుమారుడు వేణుగోపాల్ మాటల్లో.. 'ఆరు నెలల పసికందుగా ఉన్నప్పుడే మా నాన్న మరణించారు. అప్పటి నుంచి అన్ని అమ్మే.. కుట్టుమిషన్ నడుపుతు వచ్చిన ఆదాయంతో నాతోపాటు అన్న, అక్కను పోషిస్తూ ఉన్నత చదువులు చదివించారు. నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అన్న ప్రవీణ్‌కుమార్ హైకోర్టులో సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నామంటే అమ్మ అందించిన ప్రేరణే. అందుకే అమ్మ అంటే ప్రాణం.

ఇళ్లల్లో పని చేసి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తల్లిదండ్రులు బాల్య వివాహం చేశారు. భర్త చనిపోవడంతో ఇళ్లలో పనిచేస్తూ కూతురిని ఉన్నత చదువులు చదివించి అందరికీ ఆదర్శంగా నిలిచింది జయలక్ష్మి. వనపర్తి జిల్లా వారసిపల్లికి చెందిన జయలక్ష్మీకి వారి తల్లిదండ్రులు బాల్య వివాహం చేశారు. భర్త 13ఏళ్ల క్రితం మృతి చెందాడు. దాంతో కొల్లూర్ ప్రభుత్వ డబుల్ బెడ్రూంలలో నివసించే జయలక్ష్మి ఇళ్లల్లో పని చేస్తూ తన కూతురు నందినిను బీఈడి చదివించింది. మంచి సంబంధం చూసి పెళ్లి చేసింది. ఈసందర్భంగా నందిని మాట్లాడుతూ తన తల్లి కష్టపడి తనను చదివించిందని తెలిపారు. తాను ప్రస్తుతం ఇంటర్నేషనల్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నట్లు వివరించారు. అమ్మనే తనకు ఆదర్శమని తెలిపారు.


తల్లి జయలక్ష్మీతో నందిని

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తూప్రాన్: తూప్రాన్, మనోహరాబాద్ ఉమ్మడి మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. తూప్రాన్, మనోహరాబాద్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: సీఐటీయూ

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను శనివారం మెదక్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. కార్మిక వర్గం వందేళ్లు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను ముందుకు తీసుకొచ్చిందని ఆరోపించారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాలనర్సు, సాయిలు, శౌకత్ అలీ, హలీమ్, రాజు, కృష్ణ, కుమార్, కొమరయ్య, గట్టయ్య, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి మృతి


సరళాదేవి (ఫైల్)

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సరళాదేవి (60) రాత్రి మృతిచెందారు. ఎస్ఐ లింగం కథనం ప్రకారం.. సరళాదేవి ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం రాత్రి కుమారుడితో కలిసి ఇంట్లో భోజనం చేసి హాల్‌లో నిద్రపోయారు. ఈ క్రమంలో ఆమె బెడ్‌పై నుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడింది. కుమారుడు మిత్రుల సహాయంతో తల్లిని అదే రాత్రి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. డ్యూటీ డాక్టర్ రాము పరీక్షించి అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. ఆమె ఒంటిపై పలు చోట్ల రక్తం కారుతుండటంతో అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కుమారుడికి సూచించారు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా సరళాదేవి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం మండల ప్రజాపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

13న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

మెదక్ మున్సిపాలిటీ: ఈనెల 13న జిల్లాలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) నిర్వహించనున్నట్లు మెదక్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భవాని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష రాసేందుకు 1,776 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 13న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. పరీక్షలకు సహకరించాలని అన్ని శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినట్లు వివరించారు.

నేడు రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఐఎంఏ హాల్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి జనరల్ ఫిజీషియన్ వైద్యుల కాన్ఫరెన్స్ జరుగనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా సిద్దిపేట శాఖ జనరల్ సెక్రటరీ డాక్టర్ క్రాంతికుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ వెనిశెట్టి గణేశ్ తెలిపారు.

ధర చెప్పరు.. పైసలియ్యరు!

ట్రిపుల్‌ఆర్ భూ బాధితుల ఆవేదన
- ఓపెన్ మార్కెట్ రేటు ప్రకారం చెల్లించాలని డిమాండ్
- నర్సాపూర్ డివిజన్ పరిధిలోని 17 గ్రామాల మీదుగా రోడ్డు

రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి సంబంధించి భూ సేకరణకు ప్రభుత్వం చాలా నెలలుగా కసరత్తు చేస్తుంది. అయితే నిర్వాసితులకు ఎంత ధర చెల్లిస్తామనేది ఇప్పటివరకు ప్రకటించలేదు. దీంతో భూములు కోల్పోతున్న రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 17 గ్రామాల మీదుగా ట్రిపుల్‌ఆర్ ఏర్పాటు చేయనున్నారు.

– నర్సాపూర్

ట్రిపుల్‌ఆర్ భూసేకరణకు చర్యలు చేపట్టిన అధికారులు ఇప్పటివరకు ధర నిర్ణయించలేదు. అయితే భూములు ఇస్తామని రైతుల నుంచి అంగీకార పత్రాలపై మాత్రం సంతకాలు తీసుకున్నారు. కాగా భూసేకరణ చట్టం 2013 ప్రకారం రోడ్డుకు సేకరించే భూములకు ప్రభుత్వం ధర చెల్లిస్తుందని అధికారులు ప్రకటిస్తున్నారు. ఎకరానికి సుమారు రూ. 15 నుంచి రూ. 18 లక్షల వరకు రావొచ్చని చెబుతున్నారు. కాగా నర్సాపూర్ డివిజన్ పరిధిలో భూముల ధర ఎకరానికి సుమారు రూ. 80 నుంచి రూ. కోటిపైనే పలుకుతోంది. కొన్ని గ్రామాల్లో అంతకంటే ఎక్కువకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం భూసేకరణ చట్టం ప్రకారం ధర చెల్లిస్తే తమకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ మార్కెట్ ధరలకు అనుగుణంగా ధర నిర్ణయించాలని, భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.


ట్రిపుల్‌ఆర్ సర్వేను అడ్డుకొని ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

రోడ్డు వెళ్లే గ్రామాలివే..

నర్సాపూర్ మండలంలోని నాగులపల్లి, మూసాపేట, మహ్మదాబాద్, పెద్దచింతకుంట, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట, ఖాజీపేట, తిరుమలపూర్, తుజాల్‌పూర్ గ్రామాల మీదుగా రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. కాగా తొమ్మిది గ్రామాలకు చెందిన 469 మంది రైతుల నుంచి 355 ఎకరాల 34 గుంటల భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. శివ్వంపేట మండలంలోని లింగోజిగూడ, కొత్తపేట, రత్నాపూర్, పాంబండ, ఉసిరికపల్లి, పోతులబోగూడ, గుండ్లపల్లి, కొంతాన్‌పల్లి గ్రామాలకు చెందిన 579 మంది రైతులకు చెందిన సుమారు 402 ఎకరాల భూమిని ట్రిపుల్‌ఆర్ కోసం సేకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నెలాఖరుకు డబ్బులు!



ట్రిపుల్‌ఆర్ కోసం సేకరిస్తున్న భూములకు ఈ నెలాఖరుకల్లా ధర నిర్ణయించడంతో పాటు భూములు కోల్పోతున్న రైతులకు డబ్బు చెల్లించే అవకాశం ఉంది. భూసేకరణ చట్టం మేరకు ఉన్నతాధికారులు ధర నిర్ణయిస్తారు. డబ్బులు రాగానే అందరి ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– మహిపాల్, ఆర్డీఓ, నర్సాపూర్

అవార్డు సమావేశాలు పూర్తి

రోడ్డు ఏర్పాటు చేసే గ్రామాలకు చెందిన రైతులతో రెవెన్యూ అధికారులు ఇప్పటికే అవార్డు సమావేశాలు ఏర్పాటు చేశారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. ఆయా భూముల్లో ఇండ్లు, బోర్లు, చెట్లు తదితర వాటి వివరాలు అందజేయాలని సూచించారు. దీంతో రైతులు వాటి వివరాలు సమర్పించారు. అనంతరం రోడ్డు కోసం భూములు ఇస్తున్నామని రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. రోడ్డు ఏర్పాటు చేసేందుకు రూపొందించిన అలైన్‌మెంట్ పలు తండాలు మీదుగా రావడంతో వారు తమ ఇళ్లకు గిట్టుబాటు ధర చెల్లించాలని ఆందోళన చేపట్టారు.

బస్సులో బంగారు ఆభరణాలు చోరీ


విలపిస్తున్న బాధితురాలు

నర్సాపూర్ రూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి బ్యాగులో నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈసంఘటన నర్సాపూర్ బస్టాండులో శనివారం చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన నాళ్లచెరువు అనసూయ కొడిపల్లి మండలం వెంకటరావుపేటలో తన తమ్ముడి కొడుకు పెళ్లి కోసం వెల్దుర్తి నుంచి నర్సాపూర్‌కు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. నర్సాపూర్ బస్టాండ్‌లో బస్సు దిగి తన బ్యాగులో ఉన్న వస్తువులను సరి చూసుకుంది. మెదక్ ఆర్టీసీ బస్సులో ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె బ్యాగ్‌లో నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. నర్సాపూర్ బస్టాండ్ నుంచి కొద్ది దూరం బస్సు వెళ్లగానే ఆమె బ్యాగు తెలిచి ఉన్నట్లు కనిపించింది. అనుమానంతో అందులోని ఆభరణాలను చూడగా చోరీకి గురయ్యాయి. కన్నీరు పెడుతూ గట్టిగా అరవడంతో డ్రైవర్ బస్సును తిరిగి నర్సాపూర్ బస్టాండ్‌కు తీసుకొచ్చాడు. ఆర్టీసీ కంట్రోలర్, బంధువుల సహాయంతో నర్సాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని బస్టాండ్‌లోని సీసీ కెమెరాలు పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పాపన్నపేట(మెదక్): చెక్‌డ్యాంలో మునిగి ఉపాధి కూలి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని అన్నారం శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జనుముల శివరాములు (35) గ్రామ శివారులోని కొత్తకుంట వద్ద జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న చెక్ డ్యాంలో మునిగి చనిపోయాడు. ఎంతకు తిరిగి రాకపోవడంతో స్థానికులు, కూలీలు చెక్ డ్యాం వద్దకు వెళ్లి చూడగా, అందులో మునిగిన స్థితిలో కనిపించాడు. వెంటనే పైకి తీసి చూడగా, అప్పటికే చనిపోయి ఉన్నాడు. పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం అందించారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తండ్రి కళ్లెదుటే కొడుకు మృతి


శ్రీధర్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో తండ్రి కళ్లెదుటే కొడుకు మృతిచెందిన విషాద సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. మండలంలోని అజ్జమర్రికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పన్యాల పోచయ్య, కుమారుడు శ్రీధర్ (16)తో కలసి సంగారెడ్డి జిల్లా నిజాంపూర్‌లో బంధువుల పెళ్లికి బైక్‌పై బయలుదేరారు. ఈక్రమంలో కొండాపూర్ మండలం మల్కాపూర్ హైవేపై వెనుక నుంచి వచ్చిన లారీ వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై వెనకాల కూర్చున్న శ్రీధర్ తలకు తీవ్ర గాయాలై తండ్రి చూస్తుండగానే అక్కడికక్కడే మృతి చెందాడు. మండల పరిధిలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన శ్రీధర్, ఇటీవల వెలువడిన ఫలితాల్లో 473 మార్కులు సాధించాడు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి శనివారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ప్రాణం తీసిన చేపల వేట


నరేష్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో శనివా రం చోటు చేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన చందంపేట నర్సింహులు కుమారుడు నరేష్ (32) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండు రోజుల క్రితం స్థానిక కాముని చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. శనివారం మృతదేహం నీటిలో తేలడంతో వెలికితీశారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ అస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కాగా నెలన్నర క్రితం నరేష్ తమ్ముడు అనిల్ అనారోగ్యంతో మృతిచెందాడు. నెలన్నర వ్యవధిలో అన్నదమ్ములు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నిజాంపేట(మెదక్): అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నందిగామలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు (37) శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఇంటి తలుపులు తెరవకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఉరేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి బాలనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉన్నారు.

దాడి ఘటనలో ఆటో డ్రైవర్‌పై కేసు

తూప్రాన్: ప్రయాణికుడిపై ఆటో డ్రైవర్ దాడి చేసి నగదు కాజేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన రంజిత్ గర్జీ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. గత నెల 30న సికింద్రాబాద్ నుంచి బస్సులో మేడ్చల్ వరకు, అక్కడి నుంచి మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి వరకు ఆటోలో ప్రయాణించాడు. ఈ క్రమంలో ఆటోడ్రైవర్ ఆపకుండా వేగంగా వెళ్తూ తన స్నేహితుల సహాయంతో ఫోన్ పే ద్వారా డబ్బులు డ్రా చేసుకోవడంతో పాటు దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ అపహరించినట్లు తెలిపారు. అనంతరం టోల్‌ప్లాజా సమీపంలో వదిలేసి వెళ్లినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా శనిత్రయోదశి మహోత్సవం


సామూహిక శనీశ్వర పూజలో భక్తులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ శనీశ్వర క్షేత్రం శనిత్రయోదశి మహోత్సవంతో అలరారింది. భక్తజన సామూహిక తైలాభిషేకాలతో శనీశ్వరుని సన్నిదానం కిటకిటలాడింది. శనివారం ఉదయం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో వేడుకలకు అంకురార్పణ జరిగింది. ఆలయ మహామండపంలో భక్తులు బారులు తీరి కూర్చుని భక్తి శ్రద్ధలతో శనీశ్వర పూజ నిర్వహించారు. అనంతరం శని భగవానుడి మూల విగ్రహానికి తిల, తైలం సమర్పించారు. దోషాలు తొలగించి శుభాలు చేకూర్చాలని ప్రార్థించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. శనీశ్వర పూజ అనంతరం సరస్వతీ అమ్మవారిని, ఉప ఆలయాల్లో దేవతామూర్తులను దర్శించుకొని మహా ప్రసాదం స్వీకరించారు. క్షేత్రాన్ని గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి స్వాతి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ వేద పండితులు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. క్షేత్రంలో 1,000 వరకు సామూహిక తైలాభిషేకాలు జరిగినట్లు ఆలయ మేనేజర్ రఘుపవన్ పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

కలెక్టర్ రాహుల్‌రాజ్


ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రామాయంపేట(మెదక్): అకాలవర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం మండలంలోని అక్కన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, సజావుగా తూకం ప్రక్రియ నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ట్యాగ్ చేసిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని తరలించాల్సి ఉంటుందని, కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు వివరాలు, రైతుల ఖాతా వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఈమేరకు కేంద్రాల నిర్వాహకులు టార్పాలిన్లతో పాటు గన్నీ సంచులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ఐకేపీ ఏపీఎం రాములు, ఇతర అధికారులు ఉన్నారు.

వీర సైనికులకు ఘన నివాళి


మెదక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: వీరమరణం పొందిన భారత సైనికుల పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని జిల్లా బంజారా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి మెదక్ పట్టణంలోని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వీర మరణం పొందిన భారత సైనికులు భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పాక్ ఇప్పటికైనా తమ వక్రబుద్ధిని మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, గిరిజన సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీను నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్, నాయకులు రమేష్ నాయక్ రంజిత్ నాయక్, సురేష్ నాయక్ గణేష్ నాయక్, శ్రీను నాయక్, సుభాష్ నాయక్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జొన్న, ఆలు రైతుకు నిరాశ

- ఈసారి కూడా పెరగని పంట రుణాల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్
- వరికి నామమాత్రంగా రూ. వెయ్యి పెంపు
- పెరిగిన సాగు వ్యయానికి తగ్గట్టు పెంచలేదంటున్న రైతులు
- జిల్లా బ్యాంకులకు అందిన ఆదేశాలు


సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పంట రుణాల మంజూరులో కీలకమైన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ విషయంలో జొన్న, సోయాబీన్ వంటి పంటలు సాగు చేసే రైతులకు ఈసారి నిరాశే ఎదురవుతోంది. వరి, మొక్కజొన్న వంటి పంటల సాగుకు ఇచ్చే పంట రుణాల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఈ ఏడాది స్వల్పంగా పెంచినప్పటికీ...జొన్న, సోయా, ఆలు వంటి పంటలు సాగు చేసే రైతులకు మాత్రం పెంచలేదు.

ఈ ఏడాది కూడా అంతేమొత్తంలో...

గత ఆర్థిక ఏడాది 2024–25లో జొన్నకు బ్యాంకర్లు ఎకరానికి రూ.19 వేలు ఇచ్చే వారు. ఈసారి కూడా అంతే మొత్తంలో పంట రుణం ఇవ్వనున్నారు. అలాగే సోయా రైతులకు గత ఆర్థిక ఏడాదిలో ఇచ్చిన మాదిరిగానే ఈసారి కూడా ఎకరానికి రూ.30 వేల చొప్పున రుణం ఇవ్వనున్నారు. ఉద్యానవన పంటల్లో ఒకటైన ఆలుగడ్డను కూడా రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ పంటకు కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెరగలేదు. ఎకరాకు రూ.50 వేలకే పరిమితం చేశారు. ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో ఆయా పంటల సాగు చేసే రైతులకు బ్యాంకర్లు ఇచ్చే పంట రుణాలకు సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేస్తూ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు నుంచి జిల్లాలోని బ్యాంకులకు ఆదేశాలందాయి.

సాగు వ్యయం పెరిగిన జొన్న, సోయా పంటలు

అన్ని పంటల మాదిరిగానే జొన్న, సోయా పంటల కూడా సాగు వ్యయం భారీగా పెరిగింది. కూలీల ఖర్చులు, ఎరువులు, విత్తనాల ధరలు ప్రతి ఏటా పెరుగుతూనే వస్తున్నాయి. ఆలు గడ్డకు విత్తన భారమే అధికంగా ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి ఈ ఆలు విత్తనాలు తెచ్చుకోవాల్సి ఉంటుంది. దీంతో ఈ పంటల పెట్టుబడి గణనీయంగా పెరుగుతోంది. కానీ, ఈ పెట్టుబడికి తగ్గట్టుగా పంట రుణానికి సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచకపోవడంతో రైతులు నిరాశలో కూరుకుపోయారు.



ఉద్యాన వన పంటలకు...

ఉద్యానవన పంటల సాగుకు జిల్లాలో ఎక్కువగానే ఉంటుంది. ప్రధానంగా అల్లంను సాగు కూడా ఉంటుంది. ఈ అల్లం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎకరాకు రూ.67 వేల నుంచి రూ.71వేలకు పెరిగింది. అయితే అల్లంకు విత్తన ఖర్చు అధికంగా ఉంటుంది. ఈ విత్తనాల కోసం రైతులు రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. మామిడి పంటకు ఎకరాకు రూ.44 వేల నుంచి రూ.47 వేలకు పెరిగింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నామమాత్రంగా పెంచడం పట్ల రైతు సంఘాలు పెదవి విరుస్తున్నాయి. రైతుల పెట్టుబడులకు తగ్గట్టుగా ఈ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

వరికి రూ. వెయ్యి పెంపు

జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పరిశీలిస్తే...వరి సాగుకు ఎకరానికి ఇచ్చే పంట రుణం రూ.వెయి మాత్రమే పెరిగింది. 2024–25లో ఈ పంటకు ఎకరానికి రూ. 45 వేలు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 46 వేలకు పెంచారు. నామమాత్రంగా ఈ పెంపు ఉండటం పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు. మొక్కజొన్న స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూ.28,000ల నుంచి రూ. 30,000లకు పెరిగింది. పత్తికి రూ. 46,000 నుంచి రూ. 48,000లకు పెంచారు. కందికి రూ.21 వేల నుంచి రూ. 22 వేలకు పెరిగింది.

చరిత్ర ఘనం.. శిథిల జ్ఞాపకం


సదాశివనగర్ తండాలో పూర్తిగా శిథిలమైన గడీ

జిల్లాలో 155 గడులు పాక్షికంగా శిథిలం

రామాయంపేట(మెదక్): చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న గడి కోటలు శిథిలమవుతున్నాయి. వీటి మరమ్మతుల గురించి ప్రభుత్వాలు ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గత వైభవం చాటిచెప్పిన గడికోటలు రానురాను కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. జిల్లా పరిధిలో సుమారు 250 వరకు గడికోటలు ఉండగా, వీటిలో చాలావరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇందులో కొన్ని అత్యంత ప్రమాదకరంగా మారాయి. గ్రామాల్లో ఉన్న గడులు గత వైభవానికి చిహ్నాలుగా ఉన్నాయి. ఇవి 150 ఏళ్ల క్రితమే నిర్మించినట్లు సమాచారం. అప్పటి పాలకులు శత్రువుల రాకను దూరం నుంచే తెలుసుకునేలా గ్రామంలో ఎత్తయిన ప్రదేశంలో గడులు నిర్వహించినట్లు పెద్దలు చెబుతుంటారు. శత్రువులు నేరుగా గ్రామాల్లోకి రాకుండా నిలువరించడానికి వీటిని ఉపయోగించేవారని తెలిసింది. అయితే వాటి నిర్వహణ విషయమై ఆయా పంచాయతీలు చేతులెత్తేయడంతో రోజురోజుకు శిథిలమవుతున్నాయి.

పురావస్తుశాఖ దృష్టి సారించాలి

గ్రామాల్లో ఒక్కో గడిది ఒక్కో చరిత్ర.. ఇవి శిథిలమవుతుండటంతో వాటి చరిత్ర సైతం కనుమరుగయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాలు, తండాల్లో గడులున్న ప్రదేశంలోనే గ్రామాలు, గిరిజన తండాలు వెలిసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. పురావస్తుశాఖ అధికారులు వీటిని సంరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలి.

గడీతోనే ఆవిర్భవించిన తండా

ఝాన్సిలింగాపూర్ శివారులో దట్టమైన అటవీప్రాంతంలో సుమారు 150 ఏళ్ల క్రితం గడి నిర్మించినట్లు తెలిసింది. ఈగడి వద్దకు తరచూ అప్పటి రాజులు వేటకు వచ్చేవారని సమాచారం. వారు అక్కడ నెలల తరబడి విడిది చేసే వారని, ఆ తరువాతనే అక్కడ సదాశివనగర్ తండా వెలిసినట్లు అప్పటి తరం వృద్ధులు చెబుతున్నారు. నేడు ఈ గడికోట పూర్తిగా శిథిలమైంది. అప్పటి పాలకులకు సంబంధించి వంశంలో కొందరు ఇప్పటికీ గ్రామానికి వచ్చివెలుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం ఈగడీ స్థలాన్ని పంచాయతీవారు పర్యవేక్షిస్తున్నారు. తొనిగండ్ల గ్రామం వద్ద ఉన్న గడీ వద్ద ప్రతిసారి ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

మరమ్మతులు చేయించాలి



గ్రామాల్లో గతంలో నిర్మించిన గడీలు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. గతంలో రక్షణ పరంగా వీటిని వినియోగించేవారని తెలిసింది. గత వైభవానికి చిహ్నంగా వీటిని మరమ్మతు చేయించాలి. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– నర్సింలు, అక్కన్నపేట